క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని తాళ్లవీరప్పగూడెం సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ వర్క్ జరుగుతున్నందున గురువారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయ ఏర్పడుతుందని బుధవారం విద్యుత్ ఏఈ అబ్దుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్ల వీరప్పగూడెం, ఇర్కిగూడెం, నర్సాపురం ఫీడర్ల కింద ఉన్న గ్రామాలకు ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంత తైబజార్‌కు 28న వేలం

త్రిపురారం : మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే సంతలో దుకాణదారుల నుంచి రుసుము వసూలు చేయడానికి(తైబజార్) శుక్రవారం తిపురారం పంచాయతీ కార్యలయం వద్ద వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు పంచాయతీకి ఎలాంటి బకాయి ఉండరాదని, ముందుగా రూ.10వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు. వేలం పాటలో తాయ్ బజార్ పొందిన వారు అదే రోజు సాయంత్రం పూర్తి డబ్బులు గ్రామ పంచాయతీకి చెల్లించాలన్నారు. రూ. 100 బ్రాండ్‌పై అగ్రిమెంట్ సమర్పించాలన్నారు. సంతలో రుసుము గ్రామ పంచాయతీ వారు నిర్ణయించిన రేటు ప్రకారం వసులు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9848045099 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఏప్రిల్ 10న బార్ అసోసియేషన్ ఎన్నికలు

మిర్యాలగూడ టౌన్ : ఏప్రిల్ 10వ తేదీన మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఎనినకలు నిర్వమించనున్నట్లు న్యాయవాద ఎన్నికల అధికారులు ఏచూరి శ్రీనివాస్, విగ్రహాల సుధాకర్‌రావు, పవన్‌కుమార్, రెడ్డిపల్లి సైదులు తెలిపారు. బుధవారం స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈనెల 27న ఓటరు లిస్ట్ ప్రదర్శన, 28, 29వ తేదీల్లో నామినేషన్లు ఉంటాయని తెలిపారు. ఏప్రిల్ 1న పరిశీలన, 2వతేదీ విత్‌డ్రా, 3న అభ్యర్థుల ఫైనల్ లిస్ట్, 10వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారం రోజల పాటు ఎన్నికల ప్రచారం ఉంటుందన్నారు. ఎన్నికలు బార్ అసోసియేషన్‌లో ఉదయం 9గంటల నుంచి 2 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, ఆ తరువాత 3గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, అదే రోజు విజేతలను కూడా ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని జప్తి వీరప్పగూడం గ్రామానికి చెందిన బైరోజు వెంకటేశ్వర్లకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.60వేల చెక్కు మంజూరయ్యాయి. బుధవారం ఆ చెక్కును మాజీ ఎంపీటీసీ వంకాలయపాటి రత్నకుమారి చలపతిరావులు వెంకటేశ్వర్లకు అందజేశు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పేలపోలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాగర్ సీఐ బాధ్యతల స్వీకరణ


సీఐ శ్రీనునాయక్

నాగార్జునసాగర్ : సాగర్ సీఐగా బి.శ్రీనునాయక్ బుధవారం విధుల్లో చేరారు. వీరు మిర్యాలగూడ టూ టౌన్‌ఎస్ఐగా పనిచేస్తూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి(సాగర్) మండల ఎస్ఐగా బదిలీపై వచ్చారు. నెలరోజులు పనిచేయగానే సీఐగా ప్రమోషన్ వచ్చింది. అప్పటి నుంచి డీఎస్‌బీ నల్లగొండలో విధులు నిర్వహించారు. ప్రమోషన్ అనంతరం నాగార్జున సాగర్‌కు సీఐగా వచ్చారు. ఇక్కడ పనిచేసిన కె.బీసన్న నల్లగొండ ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

హాలియా : మండలంలోని పేరూర్ గ్రామంలోని శివాలయం ప్రాంగణంలో బుధవారం సీసీ రోడ్డు పనులను అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు సుమారు రూ. 5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాలియా మార్కెట్ డైరెక్టర్ ఎస్‌కె గౌస్ బాబా, పేరూర్ శివాలయం చైర్మన్ కొండారెడ్డి, నాయకులు సైదులు మాదిగ, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రామలింగం యాదవ్, కార్యదర్శి జానీ బాబా, ఎస్‌కె జానీ పాషా. రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపునకు రాయితీ

- వడ్డీపై 90శాతం సబ్సిడీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- 31వ తేదీ వరకు చెల్లింపునకు అవకాశం
- వందశాతం వసూలు చేసేలా ప్రత్యేక టీంల ఏర్పాటు


మిర్యాలగూడ మున్సిపాలిటీ కార్యాలయం

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో ఆస్తి పన్ను బకాయిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గతేడాది మార్చి 31వ తేదీ వరకు ఉన్న బకాయిల వడ్డీపై 90శాతం రాయితీని కల్పిస్తూ మార్చి 25వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. వన్ టైం సెటిల్‌మెంటు (ఓటీఎస్) కింద ఆస్తీ పన్నులపై 90శాతం రాయితీని కల్పిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. వడ్డీ మాఫీ కోసం వన్‌టైం సెటిల్‌మెంటు పథకాన్ని అమలు చేసింది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని నివాస గృహాలు, వాణిజ్య, వ్యాపార సంస్థలతో పాటు మొండి బకాయిలు కలుపుకొని రూ. 25.63కోట్లగాను ప్రస్తుతం రూ.8.19కోట్ల వరకు వసూలు చేశారు. అయితే పాత బకాయిదారులు(ఏరియర్స్)కు రాష్ట్ర ప్రభుత్వం 90శాతం రాయితీని కల్పిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. అయితే ప్రభుత్వ, ప్రైవేటుకు సంబంధించిన మొండి బకాయిలు ఆస్తి పన్నులు రూ.7.66కోట్ల గాను ఇందకు ఫైన్‌తో పాటు చక్రవడ్డీ కలుపుకొని మొత్తం రూ.8.8కోట్లు అయితే ప్రభుత్వం కల్పించిన 90శాతం వడ్డీ రాయితీ రూ.7.20కోట్లు వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏరియర్స్, కరెంటు కింద మొత్తం రూ.1.40కోట్లు వసూలు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 90శాతం రాయితీని కల్పిస్తూ మిగితా 10శాతం వసూలు చేసే దిశగా మున్సిపల్ రెవెన్యూ విభాగం కసరత్తు చేస్తుంది.

వందశాతం వసూలు చేసేలా..

మున్సిపాలిటీలో ఆస్తి పన్ను వసూలు చేసేందుకు మున్సిపల్ అధికారులు, రెవెన్యూ బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లతో కలిపి ఆరు టీంలను ఏర్పాటు చేశారు. ఈ టీం ద్వారా ఆస్తి పన్ను వసూలు వంద శాతం కల్పించాలనే లక్ష్యంతో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ టీంలపై మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ డీఈఈ వెంకన్న, టీపీఓ సోమయ్య, టీపీఎస్ అంజయ్య, ఆర్‌ఓ జ్ఞానేశ్వరీ పర్యవేణలో ఆర్ఐలు సాంబయ్య, సాజీల ఆధ్వర్యంలో ఆ టీంలు ఆస్తీ పన్ను వసూళ్లను చేపట్టనున్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోకుంటే పూర్తి స్థాయిలో చెల్లించాల్సి ఉంటుంది.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన వడ్డీపై 90 శాతం రాయితీని పాత బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ అవకాశం ఈనెల 31వ తేది వరకు ముగుస్తుంది. ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది. పాత బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు మున్సిపల్ సిబ్బందికి సహకరించి పట్టణాభివద్ధికి పాటుపడాలి.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ బకాయిలు చెల్లించాలి


సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యం, అధ్యాపకులు

మిర్యాలగూడ : నాలుగేళ్లుగా మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉన్న ప్రయివేటు డిగ్రీ కళాశాల యజమాన్యాలకు ప్రభుత్వం ఆర్‌టీఎఫ్ (రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీ), ఎంటీఎఫ్ (మెయింటనెన్స్ ఫీ) బకాయిలు విడుదల చేయాలని మహాత్మగాంధీ యూనివర్సిటీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల ఉపాధ్యక్షుడు మెండు వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యం, అధ్యాపకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ బకాయిలు చెల్లించకపోవడంతో అనేక మంది పేద విద్యార్థులు, యాజమాన్యాలు ఇబ్బందులకు గురువుతున్నారన్నారు. దీంతో పేద విద్యార్థులు అత్యధికంగా ఉన్న పరీక్షా ఫీజులను చెల్లించలేక విద్యను మధ్యలోనే మానేస్తున్నారన్నారు. కళాశాలల భవన యజమానులు అద్దె వేధింపులతో, ఉద్యోగాల జీతాల చెల్లింపులతో ఒత్తిడికి గురవుతున్నారని, రోజువారి ఖర్చుల కోసం కష్టపడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యాలు ఆర్థిక భారంతో, అప్పుల బాధతో కళాశాలలను నిర్వహించలేని పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేసి ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మనుగడ కొనసాగేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ధనుంజయ, శ్రీనివాస్, దామెర శ్రీనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషి చేయాలి


దేవరకొండ : తాటికోల్ గ్రామంలో ధర్మభిక్షం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ : స్వాతంత్ర్య సమర యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గౌడ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం దేవరకొండ మండలం తాటికోల్ గ్రామంలో ధర్మభిక్షం 14వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ధర్మభిక్షం విగ్రహానికి ఆయన పూలమాల వేసి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో అంజయ్యగౌడ్, రేణయ్యగౌడ్, విజయ్‌గౌడ్, బాలస్వామి, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, ఎల్లయ్య, తదితరులున్నారు.

సీపీఐ కార్యాలయంలో..

దేవరకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ, గీతా పనివారల సంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం 14వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, గీతా పనివారల సంఘం డివిజన్ అధ్యక్షుడు కుంభం జయరాములు ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నూనె రామస్వామి, వలమల్ల ఆంజనేయులు, వెంకట్రాములు, మైనొద్దీన్, బుచ్చయ్య, నగేష్, మల్లయ్య, జ్యోతిబసు, తదితరులున్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం పరిశీలన


కొండమల్లేపల్లి : జెడ్పీహెచ్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీసు భద్రత, పరీక్షకు హాజరైన విద్యార్థులు,1 44 సెక్షన్ అమలు, జిరాక్స్ కేంద్రాల మూసివేత, విద్యార్థులకు తాగునీరు, అందుబాటులో ఉన్న ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర విషయాలను చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆమె సూచించారు. ఆమె వెంట దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఆర్డీఓ రమణారెడ్డి, ఎంఈఓ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఈఓ

మిర్యాలగూడ : పదో తరగతి 12 పరీక్షా కేంద్రాలను బుధవారం డీఈఓ బొల్లారం భిక్షపతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఫ్లయింగ్ స్క్వాడ్ శ్రీను, ఎంఈఓ బాలు ఉన్నారు.

ఆలయాల హుండీ లెక్కింపు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వాడపల్లిలో కొలువైన శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి దేవాలయం, శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవాలయంలో మూడు నెలలో సమకూరిన హుండీని బుధవారం మిర్యాలగూడ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు పర్యవేక్షణలో లెక్కించారు. శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.2,31,235 ఆదాయం రాగా శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.1,07,869 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ బి.జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త సిద్ధయ్య, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు సాంబశివరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


డిండి : ఆర్థికసాయం అందజేస్తున్న చేయూత సభ్యులు

త్రిపురారం : మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన గొర్రె శేఖర్ బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. మండల కేంద్రానికి చెందిన నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి సత్యనారాయణపురంలో మృతుడు శేఖర్ ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కొండల్, గిరి, విజయ్, రమేష్ పాల్గొన్నారు.

డిండి : మండల కేంద్రానికి చెందిన చింతపల్లి మరియమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం 'డిండి యువత చేయూత' ఆధ్వర్యంలో ఆర్థికసాయంగా రూ.10 వేలు మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శైలేష్, శ్రీనువాస్‌గౌడ్, శ్రీను, కృష్ణ, దినేష్, ప్రవీణ్, ప్రేమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం


దేవరకొండ : ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు


కొండమల్లేపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు


పెద్దఅడిశర్లపల్లి : రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు


మాడుగులపల్లి : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కొండమల్లేపల్లి : ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య అన్నారు. బుధవారం ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్, లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాస్. కృష్ణయ్య, సత్యనారాయణ, వెంకటేశం పాల్గొన్నారు.

ఇళ్లు ఇవ్వాలని సీపీఎం ధర్నా

దేవరకొండ : అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు నల్ల వెంకటయ్య మాట్లాడుతూ సీపీఎం ప్రజాపోరులో భాగంగా గ్రామాల్లో ప్రజా సమస్యల అధ్యయన యాత్రలు నిర్వహించినట్లు తెలిపారు. ఎంతో మంది నిరుపేదల ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని ప్రభుత్వం విస్మరించిందని ఆయన ఆరోపించారు. గతంలో పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారి అయూబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఓ.యాదగిరి, బిజిలి లింగయ్య, జ్యోతి, నల్ల శ్రీను, రహీం, బుడిగ వెంకటేష్, ఇక్బాల్‌వలి, నరసింహ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలి

పెద్దఅడిశర్లపల్లి : పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గుడిపల్లి మండలంలోని ఘట్‌నెమలిపురంలో సీపీఎం పోరుబాటలో భాగంగా గ్రామ సమస్యలపై సర్వే చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కావలి కృష్ణయ్య, బుర్రి యాదగిరి, లోకేష్, సైదులు ,రైతులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రభుత్వ వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు అశోక్‌రెడ్డి, గోవర్ధని, శ్రీకర్, శ్రీను, అంజయ్య, శ్రీను, విష్ణు, వెంకటయ్య, నాగమణి, లక్ష్మయ్య, దేవిరెడ్డి మల్లారెడ్డి, రవి, రమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


పద్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

వేములపల్లి : సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వేములపల్లి గ్రామ మాజీ లిఫ్ట్ చైర్మన్ అనిరెడ్డి శేఖర్‌రెడ్డి సతీమణి పద్మ మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు బుధవారం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకోని పద్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంసబభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, చిర్ర మల్లయ్యయాదవ్, నంద్యాల శ్రీరాంరెడ్డి, రఘుమారెడ్డి, మాలి శేఖర్ రెడ్డి, జావిద్, బండ్ల మట్టయ్య తదితరులు ఉన్నారు.

40ఏళ్లలో దేవరకొండకు మంత్రి పదవి దక్కలేదు


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దేవరకొండ : 40ఏళ్లలో దేవరకొండ నియోజకవర్గ వర్గానికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం దక్కలేదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు అంకూరి శివ అన్నారు. బుధవారం ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలునాయక్‌కు ఎస్టీ కోటాలో మంత్రి పదవి ఇవ్వాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలునాయక్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తే నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొట్ట సుగుణయ్య, పండ్ల శ్రీను, అంకూరి సుగుణయ్య, పొట్ట విజయ్, పొట్ట బుచ్చయ్య, అంకూరి రమేష్, పొట్ట ప్రభు, నవీన్, రఘు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వ్యక్తి

- పరిస్థితి విషమం ..ఆస్పత్రికి తరలింపు

మిర్యాలగూడ అర్బన్ : పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన బుధవారం రాత్రి పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన గుంటోజు మధుబాబు రాత్రి సమయంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోకి వచ్చాడు. అతడు అప్పటికే మద్యం మత్తులో ఉండగా తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ ఓపెన్‌చేసి మీద పోసుకుని నిప్పంటించుకున్నారు. గమనించిన స్థానికులు, పోలీసులు మంటలను ఆర్పివేసి హుటాహుటిన ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అతడి పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం నల్లగొండకు తరలించారు. ఈ విషయంపై టూ టౌన్ పోలీసులు మాట్లాడుతూ పెట్రోల్ ఎందుకు పోసుకుని నిప్పంటిచుకున్నాడో తమకు తెలియదని, పూర్తి వివరాలు కోసం విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు


బయోమెట్రిక్ హాజరు వేస్తున్న తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగి

నిడమనూరు, త్రిపురారం : నిడమనూరు, త్రిపురారం తహసీల్దార్ కార్యాలయాల్లో ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరును అమలు చేస్తున్నారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరయ్యేలా నిబంధనల అమలులో భాగంగా బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తున్నారు. మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పది మండలాల్లో రెవెన్యూ ఉద్యోగులు విధిగా బయోమెట్రిక్ అమలులోకి వచ్చింది. ఉదయం 10 :30గంటల లోపు ఇన్, సాయంత్రం 5:30గంటల అవుట్ బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఉద్యోగులు గ్రామ, ప్రభుత్వ ఉన్నత కార్యాలయాల విధులకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా మూమెంట్ రిజిష్టర్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

హమాలీల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న ధనావత్ బిక్షానాయక్

మిర్యాలగూడ అర్బన్ : హమాలీ వర్కర్ల సమస్యల పరిష్కారంతో పాటు వారి సంక్షేమానికి హమాలీ వర్కర్స్ కో ఆపరేటివ్ సోసైటి కృషి చేస్తుందని ఆ సంఘం అధ్యక్షుడు ధనావత్ బిక్షానాయక్ అన్నారు. బుధవారం నిర్వహించిన సొసైటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు సంబంధం లేని వ్యక్తులు సొసైటీని అవమానించేందుకు ఆరోపణలు చేస్తున్నారని, వాటిని నమ్మొద్దని సూచించారు. సొసైటీ విషయంలో బయటి వ్యక్తులు జోక్యం చేసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సోసైటీ ఉపాధ్యక్షులు ఎం .రవి, లాలు నాయక్, విజయ్‌నాయక్, బిల్లు నాయక్, చందర్‌నాయక్, ఛత్రునాయక్, మౌలా, చిన్నా, రామారావు, బాలోజీ, చిన బాల, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం


వండర్ కిడ్స్ పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

పెద్దవూర : మండల కేంద్రంలోని వండర్ కిడ్స్ పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా, ప్రజా ప్రతినిధులుగా, ఉన్నతాధికారులుగా వ్యవహరించి ఒక్కరోజు బాధ్యతలను నిర్వర్తించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కే మౌలాలి, వైస్ ప్రిన్సిపల్ వి.అశోక్, ఉపాధ్యాయులు తేజా, సుభాషిణి, రమ, ప్రశాంత్, పావని, అక్బర్, బాలాజీ పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో చలివేంద్రాల ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీ

అడవిదేవులపల్లి : వేసవి కాలం ప్రారంభం అయినందుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు అడవిదేవులపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ మోసిన్‌బిన్ అహ్మద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మాధవరెడ్డి, దుర్గయ్య, సిబ్బంది బాలకృష్ణ, సైదయ్య , బంగారి, నర్సింహ్మారావు, సుశీల తదితరులున్నారు.

గ్రంథాలయంలో కొనసాగుతున్న భోజన వసతి


అభ్యర్థులకు భోజనం అందిస్తున్న సభ్యులు

మిర్యాలగూడ : పట్టణంలోని గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రైస్ మిల్లర్స్ సహకారంతో భోజన వసతి కొనసాగుతుంది. 15వ రోజు బుధవారం సూర్యాపేటకు చెందిన గుడిపూడి వెంకటేశ్వర్‌రావు సహకారంతో భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యన గండ్ల లింగయ్య, ట్రెజరరీ బీఎం నాయుడు, ముక్క వెంకటేశ్వర్లు, మురారి, భాగ్యలక్ష్మీ, సైదులు, సింగు రాంబాబు, వెంకటేష్, రాంరెడ్డి పాల్గొన్నారరు.

ఫుట్‌బాల్ శిక్షణకు ఎంపిక

నల్లగొండ టూటౌన్ : ఆస్ట్రియా దేశంలో జరిగే ఫుట్‌బాల్ ప్రత్యేక శిక్షణ శిబిరానికి నల్లగొండలోని ఛత్రపతి శివాజీ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన రాచూరి వెంకటసాయి ఎంపికై నట్లు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 30 మంది ప్రతిభావంతులైన ఫుట్‌బాల్ ఆటగాళ్లను ఎంపిక చేసి ఆస్ట్రియా దేశంలో నిర్వహించే శిక్షణ శిబిరానికి పంపుతున్నారని తెలిపారు. మన రాష్ట్రం నుంచి వెంకటసాయి మాత్రమే ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకటసాయిని స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి డి.విమల అభినందించారు. కార్యక్రమంలో చండూర్ గురుకుల ఫుట్‌బాల్ అకాడమీ కోచ్ లింగయ్య నాయక్, మాలోత్ శ్రీనివాస్, గణేశ్, లక్ష్మీ పాల్గొన్నారు.